# కాంగ్రెస్ గ్యారెంటీలు గంగలోకే..

- 160 గ్యారెంటీలిచ్చినా ప్రజలు నమ్మరు
- 40 ఏండ్లు జెండా మోసినోళ్లకే నో గ్యారెంటీ
- బీజేపీకి బీసీల గణనే పట్టదు.. ఆ వర్గం నుంచి సీఎంను ఎలా చేస్తారు
- బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టేందుకు ప్రజల మొగ్గు
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- పెబ్బేరు మండలంలో ఎన్నికల ప్రచారం

పెబ్బేరు, నవంబర్ 18 : ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు కాదు 160గ్యారెంటీలు ఇచ్చినా ప్రజలు ఆ పార్టీని నమ్మరని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు ఇప్పటికే తిరిగి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టేందుకు ఒక నిర్ణయానికి వచ్చారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పెబ్బేరు మండలంలోని పాతపల్లి, అయ్యవారిపల్లి, తిప్పాయిపల్లి, గుమ్మడం, గుమ్మడం తండా, యాపర్ల, బూడిదపాడు, ఈర్లదిన్నె, పెంచికలపాడు, మునగమాన్‌దిన్నె, జనుంపల్లి, బున్యాదిపురం, సూగూరు, కొత్తసూగూరు తదితర గ్రామాల్లో శనివారం మంత్రి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 40ఏండ్లు కాంగ్రెస్ జెండాను మోసిన చిన్నారెడ్డిని కాదని.. నిన్న మొన్న పార్టీలో చేరి సూట్‌కేసులు మోసిన వ్యక్తికి పార్టీ టికెట్ ఇచ్చిందని..పార్టీని నమ్ముకొన్న వ్యక్తికే గ్యారెంటీ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రజలకు ఎలా భరోసా ఇస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని యాభై ఏండ్ల పాటు పరిపాలించి అభివృద్ధిని అధోగతి చేసిన పార్టీని తెలంగాణ వాసులు ఎవరూ నమ్మరని ఆయన అన్నారు. ఆంధ్రా పాలన నుంచి విముక్తి పొంది..మళ్లీ ఢిల్లీ పాలనను ఎవరూ కోరుకోరని, ప్రజలు ఎప్పటికీ బీఆర్‌ఎస్ వెంటే ఉంటారన్నారు. కృష్ణా జలాల్లో వాటా తేల్చకుండా తాత్సారం చేస్తున్న బీజేపీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతుందని విమర్శించారు. పదేండ్ల పాలనలో బీసీల కుల గణను పట్టించుకొని బీజేపీ ఇప్పుడు బీసీని సీఎం చేస్తామంటే ఎవరూ నమ్మే పరిస్థితితుల్లో లేరని ఆయన తెలిపారు. సింగోటం కాల్వ ద్వారా గోపల్‌దిన్నె రిజర్వాయర్ నీళ్లను యాపర్ల వరకు తెచ్చేందుకు రూ. 150 కోట్లతో పనులు జరుగుతున్నాయని, అడుగు భూమి కూడా వృధా లేకుండా సాగునీటితో సస్యశ్యామలం చేయడమే తన జీవిత లక్ష్యమన్నారు. తనను రెండో సారి కూడా ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని నిరంజన్‌రెడ్డి హామీ ఇచ్చారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన చిన్నమందడి తండా వాసులతో మంత్రి నిరంజన్‌రెడ్డి


పెబ్బేరు మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

### వాల్మీకి బోయల మద్దతు బీఆర్‌ఎస్‌కే

వాల్మీకి బోయల ఓట్లు ఈ సారి బీఆర్‌ఎస్‌కే వేసేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప అన్నారు. వాల్మీకులు మాట ఇస్తే తప్పరన్నారు. వాల్మీకుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారిని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఎంతో కృషి చేస్తున్నదని తెలిపారు. వాల్మీకి బోయల స్థితిగతులను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా.. ప్రభుత్వం చెల్లప్ప కమిషన్ వేసి అధ్యాయనం చేయించి అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్రానికి పంపగా అక్కడ పెండింగ్‌లో పెట్టిన విషయాన్ని తిమ్మప్ప గుర్తు చేశారు.

### మంత్రి సమక్షంలో చేరికలు

మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో పలు గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. పెద్దమందడి మండలం చిన్నమందడి తండాకు చెందిన వంద మంది, పాతపల్లిలో ఇరవై మంది, పెబ్బేరుకు చెందిన 80మందికి మంత్రి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పెద్దింటి పద్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, సింగిల్ విండో అధ్యక్షుడు కోదండరాంరెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కర్రెస్వామి, బుచ్చారెడ్డి, శంకర్ నాయుడు, రాజశేఖర్, సత్యారెడ్డి, మజీద్, రాజవర్ధన్‌రెడ్డి, గోవిందునాయుడు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# ఓటుతో బుద్ధి చెప్పాలి

- వనపర్తిపై అవగాహన లేని వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు


జిల్లా కేంద్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఆంజనగిరి గ్రామస్తులు

వనపర్తి, నవంబర్ 18 : రాష్ట్రంలోని యువకులు, నిరుద్యోగులు, ప్రజలను మోసపూరిత గ్యారెంటీలతో ప్రలోభపెట్టడానికి ఢిల్లీ నాయకులు వస్తున్నారని.. వారి మాటలు నమ్మకుండా ఓటుతో కాంగ్రెస్ అభ్యర్థికి బుద్ధి చెప్పాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో నాయకులు చెన్నరాములు ఆధ్వర్యంలో ఆంజనగిరి గ్రామానికి చెందిన 60 మంది నాయకులు శనివారం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే పట్టణంలోని 26వవార్డుకు చెందిన బీజేపీ మహిళా మోర్చా, జిల్లా కార్యదర్శి పగిడాల పద్మమ్మ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్దపులి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 100 మంది మహిళలు, యువకులు సింగిరెడ్డి వాసంతి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ,పక్కనున్న కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి వచ్చి నట్టే ముంచుతుందన్నారు. వచ్చిన ఆరునెలలకే ఇచ్చిన గ్యారెంటీలకు కాలం చెల్లిపోయిందన్నారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికలలో కూడా అదే గ్యారెంటీలతో ప్రజలను మోసం చేయడానికి వస్తుందన్నారు. ఈ పదేండ్లలో నియోజకవర్గం కోసం ఆహర్నిశలు కృషి ఏడారి ప్రాంతాని సస్యశ్యామలంగా మార్చుకున్నామన్నారు. ఈ ఎన్నికలలో వారు చెప్పుకొనేందుకు ఏమీ లేక నాయకులను ప్యాకెజీలతో వల వేసుకొని పార్టీలో చేర్చుకోవడమే పరమావధిగా పెట్టుకొని ఏదో జరిగిపోతుందని ప్రజలను మభ్య పెట్టుతున్నారని తెలిపారు. నియోజకవర్గంపై అవగాహన లేకుండా ప్రభుత్వం చేసి అభివృద్ధి తెలియకుండానే ఏదో ఒకటి మాట్లాడుతున్నారన్నారు. దీనిని గమనించిన ప్రజలు ఈనెల 30న జరిగే పోలింగ్‌లో కారుగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థికి బుద్ధి చెప్పాలన్నారు.

### మంత్రి అభివృద్ధిపై పాట రూపంలో..

జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ రచయిత పలుస శ్రీనివాస్‌గౌడ్ మంత్రి నిరంజన్‌రెడ్డి చేపట్టిన పలు అభివృద్ధి పనులపై పాట రూపకంగా వివ రించారు. దీనిని ఫ్రేమ్ చేసుకొని వచ్చి మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డి, అధికారప్రతినిధి వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ జంపన్న, ఉంగ్లం తిరుమల,బీరయ్య, సాయిలీల, లీలావతి, నిరంజన్, గౌడ సంఘం జిల్లా కన్వీనర్ పలుస కృపానంద్ గౌడ్, నాయకులు వినోద్‌గౌడ్, శ్రీకర్, అఖిల్‌గౌడ్, రవి కిరణ్, కొత్తప్రతాప్‌రెడ్డి, వేణురెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

పాన్‌గల్, నవంబర్ 18 : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కొల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రగతిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా చేరుతున్నారని చెప్పారు. శనివారం కొల్లాపూర్‌లో మండలంలోని శాగాపూర్‌లో కాంగ్రెస్ గ్రామానికి చెందిన సుధాకర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ సింగన్నయాదవ్, మాజీ సర్పంచ్ బాల్‌రాంనాయక్‌ల తోపాటు వారి అనుచరులు దాదాపు 80మంది ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పదేండ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించి దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపారన్నారు. అదేవిధంగా ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్‌దే అన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే గోస తప్పదని, అలాంటి తప్పిదం మనం చేయవద్దని తెలిపారు. 19 ఏండ్ల పాటు ఎమ్మెల్యే, మంత్రిగా వెలగబెట్టిన జూపల్లి నియోజకవర్గాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. అందుకే ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించి 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కరుమ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు అభిలాష్‌రావు, సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు హాలీంపాషా, ఉపసర్పంచ్ లలిత, బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతియాదవ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫాం-12ను వినియోగించుకోవాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, నవంబర్ 18: ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి ఒక్క అధికారి ఫాం -12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల్లో విధులు నిర్వహించేవివిధ శాఖల అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరుపతిరావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొవాలన్నారు. వనపర్తిలోని కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయితీ సెక్రటరీలు, ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి ఫాం-12ను దరఖాస్తు చేసుకోవడంతో ఓటును సులువుగా వేయవచ్చునన్నారు. ఎన్నికల రోజున ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలైన మంచినీరు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు, ఫర్నిచర్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ రోజున ఎన్నికల అధికారులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, భోజన ఏర్పాట్లు చూడాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమోరాలతో నిఘా ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు. వనపర్తిలో హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఈ నెల 21, 22 తేదీల్లో వారికి ఇంటి వద్దనే ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామ న్నారు. గ్రామాల్లో సీ విజిల్ యాప్ పోస్టర్లను ప్రచారం కల్పించేలా అతికించాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు ప్రతి అధికారి, సిబ్బంది సమిష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో పద్మావతి, జిల్లా నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

MBA/B.Ed
Seats are available with or without entrance
9866958815
:9392639172
9866957188